క్లుప్తంగా

అనాథ చిన్నారులకు అండగా...



దత్తత తీసుకున్న పిల్లలతో సునితారెడ్డి

పంజగుట్ట: సొంత పిల్లల బాగోగులు చూసేందుకే ఎంతో మందికి సమయంలేక పనివాళ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే సునితా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసిన సునితారెడ్డి 50 మందికి పైగా అనాథ పిల్లలను చేరదీయడమే కాకుండా సాయంత్రం సమయంలో రోడ్లపై పడుకునే వృద్ధులకు భోజనం అందిస్తున్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునిత మాట్లాడుతూ... ఈస్టర్‌ను పురస్కరించుకుని ఆదరణ ఫౌండేషన్‌లో ఉన్న 50 మంది తల్లి, తండ్రి లేని అనాథ పిల్లల్ని తాము దత్తత తీసుకుని వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ బృహత్కర కార్యక్రమంలో తనకు చేయూతనిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సునితా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వెంకట్, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు పుల్లారెడ్డి, ఆదరణ ఫౌండేషన్ చైర్మన్ మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలి

లిబర్టీ: హక్కుల సాధనకు ప్రజలు సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ నాయకుడు ఎం.మార్టిన్ పేర్కొన్నారు. ఉద్యమాలు, పోరాటాలు చేయకుండా ఏ సమస్యా పరిష్కారం కాదని స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సంఘటితంగా 17 ఏళ్ల పోరాటం ఫలితంగానే సర్వే నెంబర్ 48 భగత్‌సింగ్ నగర్‌లో ప్రజలకు పట్టాలు సాధించుకున్నామని తెలిపారు. వివిధ రూపాల్లో నిర్వహించిన పోరాటం ఫలితంగానే ప్రజలకు శాశ్వత పట్టాలు దక్కాయని గుర్తు చేశారు. 17 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న ప్రజలకు ఎట్టకేలకు ప్రభుత్వం పట్టాలివ్వటం శుభపరిణామం అని అన్నారు. రానున్న రోజుల్లో అదే పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని మార్టిన్ స్పష్టం చేశారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



జీఎంకు ఫిర్యాదు చేస్తున్న బస్తీవాసులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని వెంకటేశ్వరనగర్ బస్తీలో కొత్త లైన్లు వేసినా ఇప్పటికీ చాలా నివాసాలకు సరిపడా నీరు రావడం లేదని బస్తీవాసులు జలమండలి జీఎం హరిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం బస్తీ వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన జలమండలి జీఎంకు మహిళలు, బస్తీవాసులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడంతో స్థానికంగా ఉన్న మేనేజర్‌ను జీఎం మందలించారు. వెంటనే ఆయా బస్తీల్లోని నివాసల వద్ద క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన మేనేజర్‌కు సూచించారు.

కరుణామయుడు చిత్ర ప్రదర్శన

రహమత్‌నగర్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయకనగర్ సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కరుణామయుడు చలన చిత్రాన్ని ప్రదర్శించారు. స్థానిక కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనలో వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీయోను మందిరం పాస్టర్లు ఎం.ప్రసాద్, అంజమ్మ మాట్లాడుతూ... ఏసు క్రీస్తు జీవితం శాంతి, కరుణ, ప్రేమలను బోధిస్తుందన్నారు. పాస్టర్లు ఇమ్మానియేల్, డానియల్ పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో శ్రీవిద్యకు గోల్డ్‌మెడల్



సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్‌లోని సియెటెడ్ ఫెలిసి స్కూల్‌లో నిర్వహించిన ఇంటర్ స్కూల్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో బంజారాహిల్స్‌లోని శ్రీసాయిరాం హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న శ్రీవిద్య గోల్డ్ మెడల్ సాధించింది. లెవెల్–2 గర్ల్స్ కేటగిరిలో మెడల్ సాధించినట్లు స్కూల్ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్‌లో ఆమెకు అభినందనలు తెలిపారు.

సర్కారువారి..
ప్లే స్కూల్ అదుర్స్!

ఆదర్శంగా జ్ఞానీ జైల్ సింగ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం

- స్వచ్ఛంద సంస్థల దాతృత్వంతో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- శుచి, శుభ్రత, పౌష్టికాహారానికి కేరాఫ్

జ్ఞానీజైల్ సింగ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం





ఇది ప్రభుత్వం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం... ఈ కేంద్రంలోకి అడుగు పెట్టగానే గోడలకు రంగురంగుల బొమ్మలు దర్శనమిస్తాయి... ఇంకాస్త ముందుకెళ్తే పూల మొక్కలు, ఆకు కూరల మొక్కలు, కూరగాయల మొక్కలు... ఇంకాస్త ముందుకెళ్తే విద్యార్థులు కూర్చొని చదువుకోవడానికి అందమైన రంగురంగుల కుర్చీలు కనిపిస్తాయి... వెరసి ఈ అంగన్‌వాడీ కేంద్రం టాక్ ఆఫ్ టౌన్‌గా అయిపోయింది.

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం ఇప్పుడు నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాలకే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని అన్ని హంగులతో నేత్రపర్వంగా తీర్చిదిద్దారు. చిన్నారులను ఇట్టే ఆకట్టుకునేలా చిత్రాలు, ఇతర ఏర్పాట్లను అందుబాటులో ఉంచారు.

ఎస్‌బీఐ టోలిచౌకి సహకారంతో...

- సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా టోలిచౌకి ఎస్‌బీఐ శాఖ ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని సకల హంగులను కల్పించింది. సర్వాంగ సుందరంగా, కనువిందు చేసే రీతిలో, రంగురంగులతో ముస్తాబు చేసింది.
- ముందుగా ఈ స్కూల్‌ను రంగులతో తీర్చిదిద్దింది పిల్లలకు తేలికగా అర్థమయ్యే రీతిలో తరగతి గదిలోని గోడలపైన ఆకట్టుకునే రంగులతో పండ్లు, కూరగాయలు, పూలను పెయింటింగ్ వేశారు.
- ఏ, బీ, సీ, డీలు, అ, ఆలు, అంకెలు, సండే, మండే ఇలా పిల్లల చదువులకు ఉపయోగపడే రీతిలో తీర్చిదిద్దారు. దీనికి తోడు పిల్లలు కూర్చునేందుకు రంగురంగుల కుర్చీలను అందించారు.
- తరగతి గదిలోకి అడుగు పెట్టగానే ఔరా.. అనే రీతిలో కలర్‌ఫుల్ కాంబినేషన్ ఇట్టే కట్టి పడేస్తున్నది.
- ఇక్కడికి వచ్చే గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారుల తల్లిదండ్రుల కోసం ఒక టీవీని కూడా ఏర్పాటు చేశారు. వాటర్ ఫిల్టర్ బిగించారు.
- పాఠశాల ఆవరణలో బచ్చలికూర, వేరుశనగ, మామిడి తులసి, నిమ్మ తదితర మొక్కలను కూడా నాటి పెంచుతున్నారు. నీటి సమస్య లేకుండా చూశారు.
- విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు.

పిల్లల సంఖ్య బాగా పెరిగింది



అంగన్‌వాడీ కేంద్రాన్ని టోలిచౌకి ఎస్‌బీఐ శాఖ మేనేజర్ హేమలత ప్రత్యేక శ్రద్ధతో అందంగా రూపొందించారు. సీఎస్ఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా బ్యాంకు మా పాఠశాలను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. ఇక్కడ 20 మంది పిల్లలు క్రమం తప్పకుండా వస్తున్నారు. 23 మంది గర్భిణులు, 15 మంది బాలింతలు, 45 మంది కిషోర బాలికలు వస్తుంటారు. ప్రీ స్కూల్‌ను సుందరంగా తీర్చిదిద్దడంలో కృషి చేసిన బ్యాంకుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మొన్నటిదాకా రంగులు వెలిసి పలు సమస్యలతో భవనం శిథిలావస్థకు చేరి ఇక్కడికి రావాలంటేనే పిల్లలు, తల్లిదండ్రులు భయపడేలా పరిస్థితి ఉండేది. ఆయా సమస్యలను పరిష్కరించి, మెరుగైన వసతులతో అంగన్‌వాడీ కేంద్రాన్ని అబ్బురపరిచేలా రూపొందించడం అందరికీ ఎంతో సంతోషంగా ఉంది.

– శివమ్మ, అంగన్‌వాడీ టీచర్, జ్ఞానీజైల్‌సింగ్‌నగర్





అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దానం శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగేందర్

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో రూ. 72.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సోమవారం కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ బస్టాప్ వద్ద రూ. 29 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వెనుకాల రూ. 31 లక్షల వ్యయంతో 300 ఎంఎం డయా సీవరేజి పైప్‌లైన్ పనులకు, గురుబ్రహ్మనగర్‌లో రూ. 12.50 లక్షల వ్యయంతో 150 ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం దానం మాట్లాడుతూ... డివిజన్‌లో ఒక్క రోజే రూ. 72.50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభమవుతున్నాయని వెల్లడించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో, సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడంలో తమ పార్టీ ముందుంటున్నదన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి హడావుడి చేసే పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం శ్రీనివాసులు, మేనేజర్ రాంబాబు, జీహెచ్ఎంసీ డీఈ మణిపాల్, ఏఈ సతీష్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు చౌహాన్ పాల్గొన్నారు.

సందడిగా ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపీనాథ్

రహమత్‌నగర్: రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని ప్రతీకగా నిలుస్తాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శ్రీరాంనగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు దుబాయ్ నజీర్ ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం గోపీనాథ్ మాట్లాడుతూ... నెల రోజులుపాటు ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లింలకు అల్లాహ్ అనుగ్రహం తప్పక ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వంలోనే ముస్లింలకు రంజాన్ కానుకలు అందిస్తున్నదని, సీఎం కేసీఆర్ ఇఫ్తార్‌ను అధికారికంగా ఏర్పాటు చేసి, అందులో పాల్గొంటారన్నారు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, జూబ్లీహిల్స్ మైనారిటీ విభాగం నాయకుడు తన్వీర్‌ఖాన్, బీఆర్ఎస్ పార్టీ బోరబండ డివిజన్ ఇన్‌చార్జ్ సిరాజ్, నేతలు జబ్బార్‌ఖాన్, గని, అక్బర్ ఖురైషి, అన్వర్, నూర్, సలీం, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హతవేటు అప్రజాస్వామికం



కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలను అభినందిస్తున్న వీహెచ్, రోహిణ్‌రెడ్డి తదితరులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్, గౌతంనగర్, దీన్‌దయాల్ నగర్ బస్తీల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు, వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి. రోహిణ్‌రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్, మహేందర్ తదితరులు పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. బడుగు బలహీన వర్గాలు ఈ అన్యాయాన్ని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం వేసిన అనర్హత వేటు ఉప సంహరించుకోవాలని కోరుతూ పోస్టు కార్డుల ఉద్యమాన్ని త్వరలో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ కక్షసాధింపు చర్యలను ప్రజలంతా తప్పుపడుతున్నారని అన్నారు. రాబోయేది కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమేనని బలహీన వర్గాల ప్రభుత్వం రాబోతున్నదని వెల్లడించారు.

కామర్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో ప్రిన్సిపాల్ రఘువీర్ తదితరులు

ఖైరతాబాద్: డిగ్రీ, పీజీ స్థాయి కామర్స్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నిర్వహించిన కామర్స్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులను సోమవారం ప్రదానం చేశారు. లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాల, అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆంబిషన్స్ కెరీర్ కౌన్సిలర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కామర్స్ టాలెంట్ టెస్ట్‌లో నగరంలోని 50 కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి జి.శివానంద్ (ఓయూ) రూ. 7000, సాయి నిఖిత (అవినాష్ కాలేజ్), రెండవ బహుమతి పూజ (ఓయూ) రూ. 3000, మూడవ బహుమతి సంజన, కావ్య (ఐఐఎంసీ కళాశాల) గెలుచుకున్నారు. కన్సొలేషన్ బహుమతులను మరో పది మంది విద్యార్థులకు అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే ఇలాంటి టాలెంట్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

బంజారాహిల్స్: గురువులను శాలువాలతో సత్కరించుకున్నారు... పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.. చదువుల తల్లి రుణం తీర్చుకోవడానికి తాము చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలని తీర్మానించుకున్నారు. సందడిగా... ఒక్కటిగా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో 1998వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. విద్యార్థులకు అప్పుడు చదువులు చెప్పిన 18 మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. లక్కీ 9 కోర్ కమిటీ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు బి.రాజేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు సాయి ప్రసాద్, నందిని, జనరల్ సెక్రటరీ వెన్నెల రేణుక, విజయ్‌కృష్ణ, స్వప్న, వి.పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తాము చదువుకున్న పాఠశాలకు అండగా నిలుద్దామని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఇప్పటికే పలు సందర్భాల్లో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామంటూ అందుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.



రాజ్‌భవన్ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఇంద్రసేనారెడ్డికి అభినందన

హిమాయత్‌నగర్: దేశంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తిన సంక్షేమం, అభివృద్ధిని చూసి బీజేపీలో చేరిన దివంగత జస్టిస్ సుభాషిణ్‌రెడ్డి కుమారుడు ఇంద్రసేనారెడ్డికి ఆ పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ ముదిరాజ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన నియంతృత్వ విధానాల పట్ల ప్రజలు విరక్తి చెందారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా సమష్టిగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్, సుధీర్, నవీన్, రామస్వామి, వెంకటేష్, గోపి, రజినీకాంత్, శ్రీనివాస్, సాయిరామ్, సాయికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

రంజాన్ కానుకల పంపిణీ

శ్రీనగర్‌కాలనీ: ముస్లింల సంక్షేమం.. అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివిధాలా ప్రాధాన్యమిస్తోందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్ జనప్రియ గ్రౌండ్స్‌లో ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ డి.సంజీవ, షరీఫ్ ఖురేషి, అజీమ్, రసూల్, సూరి, జమీల్ పాల్గొన్నారు.

పార్కు సుందరీకరణ పనుల ప్రారంభం

ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కాలనీ పార్క్‌లో రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సుందరీకరణ పనులను సోమవారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ షరీఫ్, డి.సంజీవ, కాలనీ ప్రతినిధులు కృష్ణశర్మ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ కానుకలను అందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

ఇందిరానగర్‌లో సామాజిక న్యాయ వారోత్సవాలు



సహపంక్తి భోజనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల

ఫిలింనగర్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో సోమవారం సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం. 2 ఇందిరానగర్ బస్తీలో దళిత కార్యకర్త ఇంట్లో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక మహిళలతో సహపంక్తి భోజనం చేశారు.

చర్చి పాస్టర్ల సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే దానం



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని చర్చి పాస్టర్ల సమావేశం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న ఆయా చర్చిల పాస్టర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో 80కిపైగా చర్చిలు ఉన్నా క్రిస్టియన్ గ్రేవియార్డ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పాస్టర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో 75 మంది పాస్టర్లు, 120 మంది అసోసియేట్ పాస్టర్లు పాల్గొన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమాధులకు స్థలం కావాలని కమ్యూనిటీ హాల్ అవసరమని పాస్టర్లు అడగగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. తప్పనిసరిగా సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పీటర్, ప్రధాన కార్యదర్శి జి. జీవానందం, ఉపాధ్యక్షుడు కె. రవికుమార్, ఆంటోని దాస్, సలహాదారు ఎం. ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ ఆర్టిస్ట్, హ్యాండీ క్రాఫ్ట్స్

వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులు

బంజారాహిల్స్: తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అనుబంధంగా ఉన్న తెలంగాణ సినిమా అండ్ టీవీ పెయింటింగ్ ఆర్టిస్ట్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం బంజారాహిల్స్‌లో నిర్వహించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి. కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్. రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా సాయికుమార్ ఎన్నిక కాగా మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు భరత్, రంగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

హిమాయత్‌నగర్: అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలపై షీటీం కొరడా ఝుళిపించింది. పలువిధాలా అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారికి జైలు శిక్ష విధించినట్లు అడిషినల్ సీపీ (క్రైం, ఉమెన్) ఎ.ఆర్.శ్రీనివాస్ తెలిపారు. వివరాలివీ... 24 ఏళ్ల యువకుడు తన క్లాస్‌మేట్ అయిన ఓ అమ్మాయిని పార్టీ ఉందంటూ ఇంటికి పిలిచి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. కూల్ డ్రింక్‌లో మత్తు పదార్థాలు కలిపి న్యూడ్ వీడియో తీశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. మరో యువకుడు పెళ్లి చేసుకుంటానంటూ యువతిని మభ్యపెట్టి శారీరకంగా గడిపాడు. ఆమె గర్భం దాల్చడంతో కొన్ని ట్యాబ్లెట్లు ఇచ్చి గర్భాన్ని తొలగించేలా చేశాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు చేయగా అతడిపై కేసు నమోదు చేశారు. రద్దీ ప్రాంతాల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వారిని తాకరాని చోట తాకుతున్న ముగ్గురిని షీటీం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. వారిపై కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరచగా న్యాయస్థానం వారికి జైలు శిక్షను విధించింది.

వేగంగా వాహనాలు.. తప్పని ప్రమాదాలు



శ్రీరాంనగర్ రోడ్డు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ పలు ప్రాంతాల్లో వేగంగా వస్తున్న వాహనాలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొత్తగా వేసిన రహదారులపై వేగంగా వాహనాలు వస్తున్నాయి. దీంతో పాదచారులు, పరిసర ప్రాంతాలవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. బోరబండ సైట్–3, వినాయకనగర్, శ్రీరాంనగర్, కార్మికనగర్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు లేక పోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్డు దాటాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు చెపుతున్నారు. ఇటీవల సైట్–3 వద్ద టిప్పర్ ఢీ కొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. శ్రీరాంనగర్, వినాయకనగర్, కార్మిక నగర్ ప్రాంతాల్లో వేగంగా వస్తున్న వాహనాల కారణంగా నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.